# సాక్షి కామారెడ్డి

ఆదివారం । 10 । నవంబర్ । 2024






**అప్‌గ్రేడైనా ఆయాలేరీ?**
మినీ అంగన్‌వాడీలను అప్‌గ్రేడ్ చేసిన ప్రభుత్వం ఇప్పటి వరకు ఆయాలను మాత్రం నియమించలేదు.
- 8లో ▸



**రైతుల సంక్షేమమే లక్ష్యం**
రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని, ప్రతి ధాన్యం గింజను కొనుగోలు చేస్తామని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ అన్నారు.
- 9లో ▸

గరిష్టం/కనిష్టం
36.3 /15.3

**వాతావరణం**
ఉదయం ఆహ్లాదకరమైన గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. రాత్రి చలి తీవ్రత పెరుగుతుంది. మంచు కురుస్తుంది.

## న్యూస్‌రీల్

### ఇంటింటి సర్వే షురూ

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : సమగ్ర సర్వేలో భాగంలో రెండో దశలో ఇంటింటికీ వెళ్లి వివరాలను సేకరించే కార్యక్రమం శనివారం జిల్లా వ్యాప్తంగా ప్రారంభమైంది. ఎన్యుమరేటర్లు తమకు కేటాయించిన ప్రాంతంలో సర్వే మొదలుపెట్టారు. ప్రభుత్వం అందించిన ప్రొఫార్మాల్లోని ఆయా అంశాలకు సంబంధించి కుటుంబ సభ్యులను అడిగి వివరాలు రాసుకుంటున్నారు. అయితే ఎక్కువ అంశాలు ఉండడం మూలంగా ఒక్కో ఇంటి వద్ద 40 నిమిషాల నుంచి గంట వరకు సమయం తీసుకుంటోంది. ఒకదాని వెంట ఒకటి అడుగుతుంటే సమాధానం ఇవ్వడానికి కొందరు వెనకాముందవుతున్నారని ఎన్యుమరేటర్లు చెబుతున్నారు. ప్రొఫార్మాలో పేర్కొన్న అన్ని అంశాలను ఫిలప్ చేయడానికి చాలా సమయం తీసుకుంటుండడంతో సిబ్బంది ఇబ్బంది పడుతున్నారు. అలాగే భూమి, అప్పుల వివరాలు అడిగితే కొందరు ఎందుకు అని ప్రశ్నిస్తున్నారని తెలిపారు. అందులోని అంశాలన్నింటినీ వివరించి అవగాహన కల్పించడం ఇబ్బందికరంగా మారింది. కాగా ఇప్పటి వరకు జిల్లావ్యాప్తంగా మొత్తం 3,01,900 కుటుంబాలను అధికారులు గుర్తించారు. శనివారం 5,345 కుటుంబాల సమగ్ర వివరాలు సేకరించారు.

### ప్రజల ఆర్థిక స్థితిగతులను తెలుసుకోవడానికే సర్వే



భిక్కనూరు : ప్రజల ఆర్థిక స్థితిగతులను తెలుసుకునేందుకు ప్రభుత్వం సర్వేను చేపట్టిందని గిరిజన సంక్షేమశాఖ ప్రిన్సిపాల్ కార్యదర్శి, ఉమ్మడి జిల్లా ప్రత్యేకాధికారి శరత్ అన్నారు. శనివారం భిక్కనూరులో జరుగుతున్న సర్వేను ఆయన పరిశీలించారు. సర్వేతో ప్రజలకు ప్రభుత్వం నుంచి మరిన్ని సేవలు అందుతాయన్నారు. ప్రజలు ఎలాంటి దాపరికాలు లేకుండా సిబ్బందికి అన్ని వివరాలు అందించాలని సూచించారు. అదనపు కలెక్టర్ నారాయణరెడ్డి, తహసీల్దార్ శివప్రసాద్, ఎంపీడీవో రాజకిరణ్‌రెడ్డి, ఈవో మహేష్‌గౌడ్ పాల్గొన్నారు.

### ఓటు హక్కు నమోదు చేసుకోవాలి



కామారెడ్డి అర్బన్ : కొత్తగా ఓటు హక్కు నమోదుకు ఈ నెల 28 వరకు అవకాశం ఉందని, జనవరి 1 నాటికి 18 ఏళ్లు నిండే వారు ఓటరుగా నమోదు చేసుకోవాలని అదనపు కలెక్టర్ వి విక్టర్ సూచించారు. పట్టణంలోని జిల్లా పరిషత్ కార్యాలయంలోని పోలింగ్ బూత్‌లలో చేపట్టిన ప్రత్యేక ఓటరు సవరణ కార్యక్రమాన్ని శనివారం ఆయన పరిశీలించారు. పోలింగ్ బూత్ స్థాయి అధికారి ద్వారా ఓటరు జాబితాలో పేరు నమోదు, జబితాలో అభ్యంతరాలు, చిరునామా సవరణలు, పోలింగ్ స్టేషన్ జబితా నిర్వహణ సేవలు పొందవచ్చని ఆయన వివరించారు.

### టీపీటీఎఫ్ జిల్లా కమిటీ ఎన్నిక



కామారెడ్డి టౌన్ : తెలంగాణ ప్రొగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్(టీపీటీఎఫ్) జిల్లా నూతన కమిటీని శనివారం జిల్లా కేంద్రంలోని కార్యాలయంలో ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా సీహెచ్ అనిల్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా సీహెచ్ లింగం, గౌరవ అధ్యక్షుడిగా సత్యనారాయణ, ఉపాధ్యక్షులుగా నళినిదేవి, శ్రీనివాస్, కరేల శ్రీనివాస్, రాజశేఖర్, నాగభూషణం, కార్యదర్శులుగా లక్ష్మి, విజయశ్రీ, నరేంద్రప్రసాద్, నరేందర్, శ్రీనివాస్, కృష్ణ, రూప్‌సింగ్ ఎన్నికయ్యారు. రాష్ట్ర అధ్యక్షుడు అశోక్‌కుమార్, ఉపాధ్యక్షుడు మహేందర్‌రెడ్డి సమక్షంలో నూతన కమిటీని ఎన్నుకొని ప్రమాణ స్వీకారం చేశారు.

### నేడు కందకుర్తికి హర్యానా గవర్నర్ రాక

రెంజల్(బోధన్): రెంజల్ మండలంలోని కందకుర్తి గ్రామానికి ఆదివారం మధ్యాహ్నం హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ రానున్నట్లు బీజేపీ నాయకులు తెలిపారు. మొదట కందకుర్తి త్రివేణి సంగమ పుష్కరక్షేత్రంలో నిర్వహించే గోదావరి నదికి హారతి కార్యక్రమంలో పాల్గొంటారని నాయకులు సంతోష్, కిషోర్, రాజుగౌడ్ తెలిపారు. అనంతరం నిర్మాణ దశలో ఉన్న డాక్టర్ కేశవరావ్ బలిరాం హెడ్గేవార్ స్ఫూర్తి కేంద్రాన్ని సందర్శిస్తారని పేర్కొన్నారు.

# పోలీసు కుటుంబం!

- శాంతిభద్రతల రక్షణలో రక్త సంబంధీకులు
- వివిధ హోదాల్లో పని చేస్తున్న పలువురు
- ఒకరికొకరు స్ఫూర్తిగా విధులు



అప్పట్లో పోలీసు ఉద్యోగంలో చేరతామంటే కన్నవాళ్లు ఒప్పుకునే వారు కాదు. 'వద్దు బిడ్డా. దానికి బదులు ఏదో ఒక పని చేసుకుని బతుకు' అనేవాళ్లు. గ్రామీణ ప్రాంతాల నుంచి అయితే అరకొరగానే పోలీసుల్లో చేరేవారు. తర్వాత కాలంలో చాలా ఊళ్ల నుంచి పోలీసు ఉద్యోగాల్లో చేరారు. కొన్ని కుటుంబాల్లో అయితే ఇద్దరు, ముగ్గురు కూడా పోలీసు కొలువులు సాధించారు. పోలీసింగ్‌లో ఎన్నో మార్పులు వచ్చాయి. మంచి వేతనాలు కూడా వస్తున్నాయి. పోలీసు ఉద్యోగాల్లో మహిళలకు రిజర్వేషన్లు కల్పించడంతో వాళ్ల సంఖ్య క్రమేపీ పెరుగుతోంది. కాగా జిల్లాలో కొన్ని కుటుంబాల్లో ఇద్దరు పోలీస్ శాఖలో పనిచేస్తున్నారు. ఒకరికి ఒకరు ఆదర్శంగా నిలుస్తున్నారు. పోలీసు కుటుంబాలపై 'సాక్షి' సండే స్పెషల్ కథనం.. – సాక్షి ప్రతినిధి, కామారెడ్డి

సండే స్పెషల్

### కానిస్టేబుళ్లుగా అన్నాచెల్లెలు



దోమకొండ మండలం లింగుపల్లికి చెందిన పి రాజు, సౌజన్య అన్నాచెల్లెలు. 2009లో సౌజన్య పోలీసు కానిస్టేబుల్ ఉద్యోగం సంపాదించగా, 2014లో రాజు కానిస్టేబుల్ అయ్యాడు. రాజు జిల్లా పోలీసు కార్యాలయంలో ఐటీ కోర్‌లో ఉద్యోగం చేస్తుండగా, సౌజన్య కామారెడ్డిలో షీ టీంలో విధులు నిర్వహిస్తున్నారు.

### భర్త ఏఆర్ ఎస్సై, భార్య ఏఎస్సై



కామారెడ్డికి చెందిన ఆర్ ఆంజనేయులు 1992లో కానిస్టేబుల్‌గా ఎంపికై ఒక్కో మెట్టు ఎక్కుతూ ఏఆర్ ఎస్సైగా కామారెడ్డిలో విధులు నిర్వహిస్తున్నాడు. ఆయన భార్య సుభాషిణి 1991లో కానిస్టేబుల్‌గా ఎంపికై ఇప్పుడు ఏఎస్సై స్థాయికి చేరుకున్నారు. భార్యాభర్తలిద్దరూ జిల్లా కేంద్రంలో పనిచేస్తున్నారు.

### తండ్రి ఏఎస్సై, కొడుకు కానిస్టేబుల్



కామారెడ్డికి చెందిన సాదు లింబాద్రి కానిస్టేబుల్‌గా 1989లో ఉద్యోగంలో చేరాడు. ఇప్పుడు ఏఎస్సైగా పిట్లం పోలీసు స్టేషన్‌లో పనిచేస్తున్నారు. ఆయన కొడుకు సాదు విశాల్ 2020లో కానిస్టేబుల్ పోస్టుకు ఎంపికై ప్రస్తుతం దోమకొండ పోలీసు స్టేషన్‌లో పనిచేస్తున్నారు.

### కానిస్టేబుళ్లుగా వదినామరదళ్లు



కామారెడ్డి పట్టణానికి చెందిన కె వెంకటలక్ష్మి 2002లో కానిస్టేబుల్‌గా ఎంపికై ప్రస్తుతం సదాశివనగర్ పోలీసు స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్నారు. ఆమె మరదలు (సోదరుడి భార్య) బి నాగలక్ష్మి కూడా 2002లో కానిస్టేబుల్‌గా ఎంపికై ప్రస్తుతం కామారెడ్డి సబ్ డివిజన్ కార్యాలయంలో పని చేస్తున్నారు.

### అన్న హోంగార్డు.. తమ్ముడు కానిస్టేబుల్



దోమకొండ మండలం లింగుపల్లికి చెందిన అన్నదమ్ములు పోలీసుశాఖలో పనిచేస్తున్నారు. ఆశం సంజీవ్ 2004లో హోంగార్డుగా చేరి కామారెడ్డి రూరల్ సీఐ ఆఫీసులో విధులు నిర్వహిస్తుండగా, ఆశం సంపత్ 2012లో కానిస్టేబుల్‌గా ఎంపికై లింగంపేట ఠాణాలో పనిచేస్తున్నారు.

### అక్క ఏఎస్సై, చెల్లి హెడ్ కానిస్టేబుల్



కామారెడ్డి పట్టణానికి చెందిన అక్కా చెల్లెల్లు పోలీసులుగా విధులు నిర్వహిస్తున్నారు. వై సుభాషిణి 1991లో కానిస్టేబుల్‌గా ఉద్యోగంలో చేరి ఇప్పుడు ఏఎస్సైగా రామారెడ్డిలో పనిచేస్తుండగా ఆమె చెల్లెలు అనంతజ్యోతి 2013లో ఉద్యోగంలో చేరి ప్రస్తుతం హెడ్ కానిస్టేబుల్‌గా జిల్లా పోలీసు కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్నారు.

### అక్కాతమ్ముడు



ఎల్లారెడ్డి పట్టణానికి చెందిన ఇంగు మంజుల 2020లో సివిల్ కానిస్టేబుల్‌గా ఎంపికై ప్రస్తుతం నిజాంసాగర్ ఠాణాలో విధులు నిర్వహిస్తున్నారు. ఆమె తమ్ముడు వెంకటేశం 2022లో టీజీఎస్పీలో కానిస్టేబుల్‌గా ఎంపికై ప్రస్తుతం శిక్షణలో ఉన్నాడు.

### అన్నాదమ్ముళ్లు



దోమకొండ మండలం లింగుపల్లికి చెందిన పోగుల రవికిరణ్ 2002లో కానిస్టేబుల్‌గా ఎంపికై ప్రస్తుతం దేవునిపల్లి స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్నారు. ఆయన సోదరుడు పోగుల రాజేందర్ 2014లో కానిస్టేబుల్‌గా ఎంపికై సీసీఎస్‌లో పనిచేస్తున్నారు.



# బడిలో అలజడి!

- టీచర్లు, పేరెంట్స్ మధ్య పెరిగిన దూరం
- పోక్సో కేసులతో వణుకుతున్న ఉపాధ్యాయులు
- ఒకరిద్దరు చేసిన పనులతో మిగతా వారికి మచ్చ

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : పాఠశాల ఉపాధ్యాయులలో ఒక రకమైన అభద్రతాభావం పెరిగింది. పిల్లల్ని ఏమైనా అంటే ఏ రకమైన ఇబ్బందులు ఎదురవుతాయోననే భయం వారిని వెన్నాడుతోంది. అక్కడక్కడా ఒకరిద్దరు టీచర్లు చేసిన తప్పుడు పనుల మూలంగా అందరినీ అదే గాటిన కట్టే ప్రమాదం ఏర్పడిందని పలువురు ఆవేదన చెందుతున్నారు. ఒకప్పుడు ఉపాధ్యాయుడు పిల్లల్ని ఎంత దండించినా తల్లిదండ్రులు ఏమనేవారు కాదు. అయినా 'మావోన్ని మంచిగ కొట్టినవ్. ఇంక నాలుగు కొట్టద్దా సార్' అనే వాళ్లు. ఇప్పుడు పిల్లల్ని చిన్న మాట అన్నా తల్లిదండ్రులు ఓర్చుకునే పరిస్థితి లేకుండాపోయింది. చదువు వచ్చినా, రాకున్నా సరే మావోన్ని కొట్టొద్దు అనే కాడికి వచ్చారు. కొందరైతే పిల్లల్ని కొట్టినా, తిట్టినా టీచర్లతో కయ్యానికి కాలుదువ్వుతున్నారు. టీచర్లు, పేరెంట్స్ మధ్య సంబంధాలు దెబ్బతినడమే దీనికి కారణం.

**పోక్సో కేసులతో అభద్రత**

తప్పు చేసిన వారు ఎంతటివారిని శిక్షించాల్సిందే. ఇదే సమయంలో అమాయకులకు ఇబ్బందులు కల్గకుండా చూసుకోవాల్సిన బాధ్యత వ్యవస్థపై ఉంది. ఇటీవల జరిగిన పలు ఘటనలు ఉపాధ్యాయులను మనోవేదనకు గురిచేస్తున్నాయి. ఓ ఉపాధ్యాయుడిపై పోక్సో కేసు నమోదు చేసే సందర్భంలో అదే పాఠశాలకు చెందిన ప్రధానోపాధ్యాయుడిని కూడా చేర్చడం ఉపాధ్యాయ వర్గాల్లో కలవరం మొదలైంది. తప్పు చేసిన వారు ఏమోగానీ, తప్పు చేయని వారు కూడా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోందని వారు మనోవేదనకు గురవుతున్నారు. విద్యార్థులను కన్నబిడ్డల్లా కాపాడాల్సిన టీచర్లే కీచకులుగా మారితే సమాజం సహించదు. అయితే కొందరు చేసిన తప్పులతో తాము ఒత్తిడిలో పాఠం చెప్పేదెలా అని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**మంచి సంబంధాలుండాలి**

బడిలో భద్రత ఉంటుందని, టీచర్ తమ పిల్లల్ని జాగ్రత్తగా చూసుకుంటారనే నమ్మకంతోనే తల్లిదండ్రులు పంపిస్తారు. అయితే చిన్న చిన్న విషయాలతో చాలా చోట్ల పేరెంట్స్, టీచర్ల మధ్య గ్యాప్ ఏర్పడి ఏదైనా అపోహలు ఏర్పడినపుడు వివాదాలు పెరుగుతున్నాయి. అందుకే టీచర్స్, పేరెంట్స్ మధ్య మంచి సంబంధాలుండాల్సిన అవసరం ఉంది. విద్యాశాఖ అధికారులు చొరవ చూపి పేరెంట్స్, టీచర్స్ మధ్య మంచి వాతావరణం ఉండేలా సమావేశాలు జరిపే ఏర్పాట్లు చేయాల్సిన అవసరం ఉంది. ఉపాధ్యాయులు కూడా తల్లిదండ్రులను పిలిపించి వారి పిల్లల చదువుల గురించి, భవిష్యత్ గురించి చర్చించడం ద్వారా ఇరువురి మధ్య సంబంధాలు పెరుగుతాయి. ఇలా అయితే చిన్న చిన్న సమస్యలు అక్కడిక్కడే పరిష్కారమవుతాయి.

**కొందరి తీరుతో..**

స్కూళ్లలో ఏమైనా సమస్యలు ఉంటే పేరెంట్స్ అంతా వచ్చి పరిష్కరించే రోజులు పోయి, సార్లు వేలకు వేలు జీతాలు తీసుకుని, సదువులు సక్కగ జెప్పుతలేరనే భావన పెరిగిపోయింది. కొందరు టీచర్లు డ్యూటీలకు ఎగనామం పెట్టి దందాల వెంట పడడం కూడా దీనికి కారణంగా భావిస్తున్నారు. ఇటీవలి కాలంలో అక్కడక్కడా పిల్లలతో ముఖ్యంగా ఆడపిల్లల పట్ల ఉపాధ్యాయులు అసభ్యకరంగా ప్రవర్తించడం, లైంగికంగా వేధించడం వంటి సంఘటనలపై పోక్సో కేసులు నమోదయ్యాయి.

**ఉపాధ్యాయ సంఘాల ధోరణి మారాలి**

ఉపాధ్యాయులు ఇబ్బందుల్లో ఉంటే ఉపాధ్యాయ సంఘాల బాధ్యులు అక్కడికి వెళ్లి వారి సమస్యను తెలుసుకుని అవసరమైతే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి భరోసా ఇవ్వాలి. కానీ సంఘాల నేతలు సభలు, ఎన్నికల సమయంలో వారి మద్దతు కోసం తిరగడమే తప్ప, వారి కష్టాల్లో భాగం కావడం లేదన్న అభిప్రాయం ఏర్పడింది. సంఘాల ఎన్నికలు, శాసన మండలి ఎన్నికలు ఉన్నాయంటే చాలు స్కూళ్లను చుట్టేసే సంఘాల నేతలు అప్పుడప్పుడు స్కూళ్లకు వచ్చి తమ కష్టాలు తెలుసుకునే ప్రయత్నం చేయాలని ఉపాధ్యాయులు కోరుతున్నారు.

# బాధ్యతాయుతంగా మెలగాలి

- కళాశాలలకు ఆరు చొప్పున పబ్లిక్ సేఫ్టీ క్లబ్‌లు
- కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



విద్యార్థులకు పబ్లిక్ సేఫ్టీ అంబాసిడర్ బ్యాడ్జీలను అందజేస్తున్న కలెక్టర్ సంగ్వాన్, ఎస్పీ సింధుశర్మ

కామారెడ్డి క్రైం : పబ్లిక్ సేఫ్టీ అంబాసిడర్లుగా ఎంపికైన వారు బాధ్యతాయుతంగా మెలగాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. జిల్లా కేంద్రంలోని సత్య గార్డెన్‌లో పబ్లిక్ సేఫ్టీ అంబాసిడర్ కార్యక్రమాన్ని జిల్లా పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో శనివారం ఏర్పాటు చేశారు. కళాశాలకు ఆరు రకాల పబ్లిక్ సేఫ్టీ అంబాసిడర్ విభాగాలను జిల్లాలోని 21 ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల్లో ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. కలెక్టర్ మాట్లాడుతూ.. ఇది ప్రజలందరికీ ఉపయోగపడే కార్యక్రమం అన్నారు. తమ కళాశాలలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా అంబాసిడర్లుగా ఎంపికైన వారు పని చేయాలన్నారు. ఎస్పీ ప్రత్యేక చొరవతో ఇలాంటి కార్యక్రమాన్ని తీసుకురావడం అభినందనీయమన్నారు.

**అవగాహన కల్పించాలి**

సమాజంలో ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో ముఖ్యమైన ఆరు సేఫ్టీ అంశాలపై ప్రజలందరికీ అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని తీసుకు వచ్చినట్లు ఎస్పీ సింధు శర్మ తెలిపారు. సమాజానికి మంచి చేయాలనే ఆలోచన విద్యార్థి దశలో బలంగా ఉంటుందన్నారు. అందుకే విద్యార్థులను, యువకులను సేఫ్టీ అంబాసిడర్లుగా ఎంపిక చేసినట్లు తెలిపారు. ప్రతి కళాశాలలో సైబర్ సేఫ్టీ క్లబ్, రోడ్ సేఫ్టీ క్లబ్, ఉమెన్ సేఫ్టీ క్లబ్, యాంటీ ర్యాగింగ్, యాంటీ డ్రగ్ కమిటీ, సోషల్ రెస్పాన్సిబిలిటీ, హెల్త్ అండ్ వెల్‌నెస్ క్లబ్‌లను ఏర్పాటు చేశామన్నారు. ప్రతి క్లబ్‌లో ఆరుగురు విద్యార్థులు, నలుగురు తల్లిదండ్రులు, ఒక అధ్యాపకుడు ఉంటారని వివరించారు. అంబాసిండర్లకు ప్రస్తుతం ఆయా అంశాలపై శిక్షణనిస్తున్నట్లు తెలిపారు. వారు పూర్తిగా నేర్చుకున్న తర్వాత క్రమం తప్పకుండా కార్యక్రమాలు చేపడుతూ అవగాహన కల్పిస్తారని తెలిపారు. డీఎస్పీ కామారెడ్డి నాగేశ్వరరావు, సీఐలు చంద్రశేఖర్ రెడ్డి, రామన్ తదితరులు పాల్గొన్నారు.

# సర్వేను దేశం మొత్తం గమనిస్తోంది

- వీడియో కాన్ఫరెన్స్‌లో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

కామారెడ్డి క్రైం : తెలంగాణలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఇంటింటి సర్వేను యావత్ దేశం గమనిస్తోందని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. సర్వే ప్రక్రియపై హైదరాబాద్ నుంచి సీఎస్ శాంతికుమారితో కలిసి ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్లతో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ.. శనివారం నుంచి ఇంటింటి సర్వే ప్రారంభమవుతున్న నేపథ్యంలో ప్రక్రియను కలెక్టర్‌లు నిరంతరంగా పర్యవేక్షించాలన్నారు. ప్రజల సమగ్ర సమాచారం సేకరించడం ద్వారా అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అందించి ఆర్థికాభివృద్ధికి కృషి చేయడానికి దోహదపడుతుందన్నారు. సర్వేలో భాగంగా ప్రజలకు అనేక సందేహాలు వస్తుంటాయన్నారు. వాటిని నివృత్తి చేస్తూ ముందుకు సాగాలని సూచించారు. ఎన్యూమరేటర్లు బాధ్యతగా వ్యవహరించాలన్నారు. అంకితభావంతో పని చేసి సర్వేను పకడ్బందీగా నిర్వహించాలన్నారు.

**మిగిలిన 'హౌస్ లిస్టింగ్'ను పూర్తిచేయాలి**

జిల్లాలో మిగిలిపోయిన హౌస్ లిస్టింగ్ ప్రక్రియను వెంటనే పూర్తిచేయాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ మండల ప్రత్యేక అధికారులను ఆదేశించారు. ఉప ముఖ్యమంత్రి వీసీ అనంతరం జిల్లా అధికారులతో ఆయన మాట్లాడారు. హౌస్ లిస్టింగ్ పూర్తయిన బ్లాక్‌లలో సమగ్ర సర్వేను ప్రారంభించాలన్నారు. ఏ ఒక్క ఇల్లు కూడా తప్పిపోకుండా సర్వే చేపట్టాలన్నారు. అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, ఆర్డీవోలు రంగనాథ్ రావు, ప్రభాకర్ పాల్గొన్నారు.

### సమాచారాన్ని పక్కాగా సేకరించాలి



రామారెడ్డి : ఇంటింటి సర్వేలో ప్రతి ఒక్కరి సమాచారాన్ని పక్కాగా సేకరించాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు. శనివారం రామారెడ్డిలోని మార్కెట్ ఏరియాలో ఇంటింటి సర్వే ను ఆయన పరిశీలించారు. ప్రశ్నావళిలో పేర్కొన్న అంశాలకు సంబంధించిన కోడ్ నెంబర్లు సరిగా నమోదు చేయాలని సూచించారు. ప్రతీ రోజూ కనీసం 10 నుంచి 15 ఇళ్ల సమాచారాన్ని సేకరించాలని ఎన్యుమరేటర్లకు సూచించారు. అనంతరం రామారెడ్డి ఉన్నత పాఠశాలలోని పోలింగ్ బూత్‌లను ఆయన పరిశీలించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు శని, ఆదివారాల్లో నిర్వహిస్తున్న ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆర్డీవో రంగనాథ్ రావు, తహసీల్దార్ సువర్ణ, ఎంపీడీవో తిరుపతిరెడ్డి, ఏపీవో ధర్మారెడ్డి ఉన్నారు.

# స్టాంప్ వెండర్ల ఇష్టారాజ్యం!

- అనుమతి ఒకచోట.. విక్రయం మరోచోట
- నిబంధనలకు విరుద్ధంగా దుకాణాల నిర్వహణ
- అధిక ధరలకు విక్రయాలు





కామారెడ్డి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

కామారెడ్డి టౌన్ : జిల్లా కేంద్రంలో స్టాంప్ వెండర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. లైసెన్స్ ఒక చోట తీసుకొని విక్రయాలు మరో చోట జరుపుతున్నారు. కొందరైతే ఫోన్ చేస్తే చాలు ఎక్కడపడితే అక్కడ ఆన్‌లైన్ లాగిన్ చేసుకుంటూ ఇచ్చేస్తున్నారు. అంతేకాక అధిక ధరలకు అమ్ముతున్నారు. నిబంధనలకు విరుద్ధంగా స్టాంప్ వెండర్‌లు వ్యవహరిస్తున్న సంబంధిత సబ్ రిజిస్ట్రార్, ఉన్నతాధికారులు పట్టించుకోవడం లేదు. కామారెడ్డి పట్టణంలో అధికారికంగా మొత్తం 9 మంది స్టాంప్ వెండర్‌లు లైసెన్స్‌దారులున్నారు. ఆన్‌లైన్‌లో మాత్రం నాలుగు అడ్రస్‌లే నమోదై ఉన్నాయి. ఈ తొమ్మిది మందిలో ముగ్గురు మినహా మిగతా వారు నిబంధనలు పాటించడం లేదని తెలిసింది. ఆర్‌బీనగర్‌లో అనుమతి తీసుకున్న ఓ వెండర్ కొత్తబస్టాండ్ ముందు జిరాక్స్ సెంటర్‌లో చాలా కాలంగా బాండ్ పేపర్‌లు విక్రయిస్తున్నట్లు సమాచారం. అతడికి ఫోన్ చేస్తే చాలు ఎక్కడ పడితే అక్కడ ల్యాప్‌టాప్‌లో లాగిన్ చేసుకుని బాండ్ పేపర్‌లు విక్రయిస్తున్నట్లు తెలిసింది. అలాగే శ్రీరాంనగర్ కాలనీ, లింగాపూర్, ఎల్‌ఐసీ ఆఫీస్ పక్కన గల స్టాంప్ వెండర్లు కొత్తబస్టాండ్, ఎన్జీవోస్ కాలనీ, పాత సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఏరియాలో చాలా కాలంగా విక్రయాలు సాగిస్తున్నారు. ఆన్‌లైన్‌లో ఉన్న అడ్రసు వద్ద ఎవరూ అందుబాటులో లేకపోవడంతో ఆన్‌లైన్‌లో చూసి వచ్చే వారు అయోమయానికి గురవుతున్నారు. అంతే కాక ఒక్కో బాండ్ పేపర్‌పై రూ.10 నుంచి రూ.20 వరకు అధికంగా వసూళ్లు చేస్తున్నారు. ఇదేంటని ప్రశ్నిస్తే తమకు గిట్టుబాటు కావడం లేదని తీసుకుంటే తీసుకోండి లేకుంటే వెళ్లండంటూ ఇష్టారాజ్యంగా మాట్లాడుతున్నారు. ఈ విషయమై కామారెడ్డి సబ్ రిజిస్ట్రార్ సాయికృష్ణను వివరణ కోరగా అనుమతి తీసుకున్న చోట కాకుండా ఇతర ప్రాంతాల్లో విక్రయాలు సాగించినా, అధిక ధరలకు విక్రయించినా లైసెన్స్‌లు రద్దు చేస్తామని తెలిపారు. ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

### క్లుప్తంగా

### లో ఓల్టేజీ సమస్య పరిష్కారానికి కృషి

- కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి



నిజామాబాద్ సిటీ: లో ఓల్టేజీ సమస్య పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేస్తోందని, ఇందుకోసం నిజామాబాద్ రూరల్, బాల్కొండ నియోజకవర్గాలకు ఆరు సబ్ స్టేషన్‌లు మంజూరు చేసిందని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్ స్టేషన్‌ల మంజూరు హర్షణీయమని, సీఎం రేవంత్‌తోపాటు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు కృతజ్ఞతలు తెలుపుతున్నామని పేర్కొన్నారు. సబ్ స్టేషన్‌ల నిర్మాణానికి అనువైన స్థలాలను పరిశీలించి నిర్మాణ పనులను ప్రారంభించాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతుకు ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి సూచించినట్లు తెలిపారు. లో ఓల్టేజీ సమస్య పరిష్కారించేందుకు కృషి చేసిన పీసీసీ చీఫ్ బొమ్మ మహేశ్ కుమార్‌గౌడ్, బోధన్, రూరల్ ఎమ్మెల్యేలు సుదర్శన్‌రెడ్డి, భూపతిరెడ్డి, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, సీఎండీ వరుణ్‌రెడ్డికి ధన్యవాదాలు తెలుపుతున్నామని ప్రకటనలో పేర్కొన్నారు.

### లెక్కింపు పూర్తికాని పట్టుబడ్డ రేషన్ బియ్యం

వేల్పూర్: వేల్పూర్ మండల కేంద్రంలోని వ జ్ర రైసుమిల్లులో శుక్రవారం పట్టుకున్న రేషన్ బియ్యం లెక్కింపు పూర్తికాలేదు. సుమారు 700 క్వింటాళ్ల వరకు మూడు లారీల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. రైసుమిల్లులో మిషన్ల డబ్బాలలో ఉంచిన సుమారు 80 క్వింటాళ్ల బియ్యాన్ని శనివారం బయటకు తీయించారు. ఇంకా మిగిలిన బియ్యాన్ని పూర్తిస్థాయిలో బయటకు తీయిస్తున్నామని ఎస్సై నాగ్‌నాథ్ పేర్కొన్నారు.

### ఇద్దరిపై కేసు నమోదు

సిరికొండ: వ్యవసాయ భూమిలోని మోటార్ పరికరాలను ధ్వంసం చేసిన ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎల్ రామ్ తెలిపారు. మండలంలోని మహిపాల్ తండాలో బదావత్ సరోజ అనే మహిళ రైతుకు చెందిన వ్యవసాయ బోరు మోటార్ పరికరాలను అదే తండాకు చెందిన బానావత్ గజన్‌లాల్, సాయికుమార్ ధ్వంసం చేశారన్నారు. బాధితురాలు శనివారం పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

## అప్‌గ్రేడైనా ఆయాలేరీ..?

- మినీ అంగన్‌వాడీ కేంద్రాలను మెయిన్ కేంద్రాలుగా అప్‌గ్రేడ్ చేసిన రాష్ట్ర ప్రభుత్వం
- ఈ ఏడాది జనవరిలోనే జారీ అయిన ఉత్తర్వులు
- 135 అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆయాల అవసరం..
- ఇప్పటికీ నోటిఫికేషన్ జారీ చేయని వైనం



తాళ్లరాంపూర్‌లోని అప్‌గ్రేడ్ చేసిన అంగన్‌వాడీ కేంద్రంలో విధులు నిర్వర్తిస్తున్న కార్యకర్త (ఫైల్)

మోర్తాడ్(బాల్కొండ): మెయిన్ అంగన్‌వాడీ కేంద్రాలుగా అప్‌గ్రేడ్ చేసిన మినీ కేంద్రాల్లో ఆయాలను నియమించకపోవడంతో కార్యకర్తలే అన్ని పనులు చేయాల్సి వస్తోంది. జిల్లాలో ఉన్న 135 మినీ అంగన్‌వాడీ కేంద్రాలను మెయిన్ కేంద్రాలుగా అప్‌గ్రేడ్ చేస్తూ గత జనవరిలోనే స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. అప్పట్లోనే ఆయాలను నియమించేందుకు నోటిఫికేషన్‌ను జారీ చేయాల్సినప్పటికీ ఇప్పటి వరకు ఆయాల నియామకానికి చర్యలు తీసుకోకపోవడంతో అంగన్‌వాడీ కార్యకర్తలు అవస్థలు పడుతున్నారు. ఎప్పుడైనా అంగన్‌వాడీ కార్యకర్తలు సెలువులో వెళ్తే గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం అందించేవారు ఉండటం లేదు. తాజాగా సమగ్ర సర్వేకు కొందరు అంగన్‌వాడీ కార్యకర్తలను వినియోగిస్తున్నారు. ఇలాంటి సందర్భంలో ఆయాల అవసరం ఎంతో ఉంది. ఆయాలు ఉన్న చోట ఎలాంటి ఇబ్బంది లేదు. ఆయాలు లేని చోట కార్యకర్తలే పౌష్టికాహారం వండి పెడుతున్నారు. ఇదిలా ఉండగా ఆయాల పోస్టులను భర్తీ చేస్తే కొంతమంది మహిళలకైనా ఉపాధి లభిస్తుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. అంగన్‌వాడీ వ్యవస్థలోనూ 65 ఏళ్ల వయస్సు నిండిన వారితో పదవీ విరమణ చేయించారు. ఈ నేపథ్యంలో అనేక చోట్ల ఆయాలు, అంగన్‌వాడీ కార్యకర్తల పోస్టులు ఖాళీ అయ్యాయి. అప్‌గ్రేడ్ చేసిన అంగన్‌వాడీ కేంద్రాల్లో కొత్తగా ఆయా పోస్టులు, పదవీ విరమణ కారణంగా ఖాళీ అయిన స్థానాల్లో భర్తీ చేపడితే బాగుటుందని పలువురు సూచిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి అంగన్‌వాడీల్లో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

**ఆదేశాలు లేవు**

అప్‌గ్రేడ్ చేసిన మినీ అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆయాల నియామకంపై ఇంకా ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు అందలేవు. ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వెలువడగానే ఆయాల నియామకం పూర్తి చేస్తాం. పదవీ విరమణ కారణంగా చాలా చోట్ల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. త్వరలోనే పోస్టులు భర్తీ కావొచ్చు.

– రసూల్‌బీ, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారిణి

## నగరంలో రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ టోర్నీ

- ఈ నెల 16, 17 తేదీల్లో ఆఫీసర్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహణ
- 35 నుంచి 70 ఏళ్ల వయస్సు వారు పోటీలకు అర్హులు
- క్లబ్ ఉపాధ్యక్షుడు తాహెర్ బిన్ హందాన్



విలేకరులతో మాట్లాడుతున్న తాహెర్ బిన్ హందాన్

నిజామాబాద్‌నాగారం: ఈనెల 16, 17 తేదీల్లో నిజామాబాద్ ఆఫీసర్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి షటిల్ బ్యాడ్మింటన్ టోర్నీని విజయవంతం చేయాలని రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్, క్లబ్ ఉపాధ్యక్షుడు తాహెర్ బిన్ హందాన్ కోరారు. నగరంలోని క్లబ్‌లో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 70 ఏళ్లకుపైగా చరిత్ర కలిగిన నిజామాబాద్ ఆఫీసర్స్ క్లబ్‌లో గతంలో ఎన్నడూ లేని విధంగా మొట్టమొదటిసారి రాష్ట్ర స్థాయి షటిల్ బ్యాడ్మింటన్ టోర్నీని క్లబ్ అధ్యక్షుడిగా ఉన్న కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు తెలిపారు. టోర్నీకి సంబంధించిన కరపత్రాలను కలెక్టర్ చేతుల మీదుగా ఆవిష్కరించామన్నారు. టోర్నీలో రాష్ట్రంలోని 33 జిల్లాల షటిల్ క్రీడాకారులు (35 నుంచి 70 ఏళ్ల వారు) సుమారు 600 మంది పాల్గొంటారన్నారు. విజేతలకు రూ.లక్ష నగదు బహుమతితోపాటు ప్రశంసాపత్రాలను అందజేస్తామన్నారు. అలాగే క్రీడాకారులకు ఉచిత వసతి, భోజన సదుపాయాలను కల్పించనున్నట్లు తెలిపారు. డబుల్స్‌లో తలపడనున్న క్రీడాకారులు తమ ఆధార్, వయస్సు ధ్రువీకరణ పత్రాన్ని వెంట తీసుకురావడంతోపాటు రూ.వెయ్యి ఎంట్రీ ఫీజు చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు 8712 300 347 నంబర్‌కు కాల్ చేసి 13వ తేదీ వరకు తమ పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. సమావేశంలో క్లబ్ సెక్రెటరీ సత్యనారాయణ, కోశాధికారి గంగాకిషన్, జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు, భక్తవత్సలం, నాయుడు స్వామిదాస్, ఫైనాన్స్ కమిటీ కో కన్వీనర్ భవంతి దేవీదాస్, ఏటీఎస్ శ్రీనివాస్, రవిరాజ్, రచ్చ మురళి, అరవింద్, కిరణ్, ఆఫీసర్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

## ప్రపంచ తెలుగు సాహితీ సదస్సుకు ప్రకాశ్



సీహెచ్ ప్రకాశ్

కామారెడ్డి అర్బన్: జిల్లా కేంద్రానికి చెందిన ప్రముఖ కవి, రచయిత, మద్దికుంట ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు సీహెచ్ ప్రకాశ్ ఈనెల 22, 23 తేదీల్లో ఖతర్ దేశ రాజధాని దోహాలో నిర్వహించే 9వ ప్రపంచ తెలుగు సాహితీ సదస్సుకు హాజరుకానున్నారు. దోహాఖతర్ కు చెందిన ఆంధ్ర కళావేదిక, వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా సంయుక్తంగా నిర్వహించనున్న తెలుగు సదస్సు అధ్యక్షుడు వెంకప్ప భాగవతుల, సంచాలకులు రాధికా మంగిపూరి.. ప్రకాష్‌కు ఆహ్వానం పంపారు. 'అక్కడి దాకా, స్వప్నశకలం, మట్టిని మరువలేను' వంటి రచనలు చేసిన ప్రకాశ్ అనేక పురస్కారాలు పొందారు. ప్రముఖ వ్యక్తులు, ఘనపాటీలు పాల్గొనే ప్రపంచ తెలుగు సాహితీ సదస్సుకు ఆహ్వానం అందడంపై ప్రకాశ్ సంతోషం వ్యక్తం చేశారు.

## ఏ దేశానికీ లేని చరిత్ర మన దేశానికి ఉంది

- దేశభక్తుల చరిత్రను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలి
- ఆర్‌ఎస్‌ఎస్ విభాగ్ ప్రచారక్ నర్రా వెంకట శివకుమార్




మాట్లాడుతున్న నర్రా వెంకట శివకుమార్

సుభాష్‌నగర్: ప్రపంచంలో ఏ దేశానికి లేని మహోన్నతమైన చరిత్ర మన దేశానికి ఉందని ఆర్‌ఎస్‌ఎస్ ఇందూరు విభాగ్ ప్రచారక్ నర్రా వెంకట శివకుమార్ పేర్కొన్నారు. దేశంలోని ప్రతి మూలలో ఎంతోమంది మహామహులైన దేశభక్తులు జన్మించారని, వారందరూ దేశం కోసం, ధర్మం కోసం తమ ప్రాణాలను నవ్వుతూ వదులుకున్నారని అన్నారు. నగరంలోని ఇంద్రాణి పాఠశాల ఆవరణలో శనివారం నిర్వహించిన కళాశాల విద్యార్థుల శిబిర ఉద్ఘాటన కార్యక్రమానికి వెంకట శివకుమార్ ముఖ్యవక్తగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 1857 స్వతంత్ర సంగ్రామం దేశ చరిత్రలోనే సువర్ణ అక్షరాలతో లిఖించదగినదన్నారు. తాంతియా తోపే, ఝాన్సీ లక్ష్మీబాయి, వాసుదేవ బలవంత ఫడ్కే వంటి ఎందరో మహానుభావులు దేశ ప్రజల్లో స్వాతంత్ర్య కాంక్షను రగిలించారని, వారి చరిత్ర మనందరికీ ఆదర్శమన్నారు. రాజకీయ కుట్రలకు బలైపోయిన దేశభక్తుల చరిత్రను తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. దేశం విదేశీ పరిపాలనలో మగ్గిపోవడానికి కారణాలను అన్వేషించిన డాక్టర్ హెడ్గేవార్.. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత కూడా తిరిగి మళ్లీ పరతంత్రం రాకుండా ఉండాలంటే దేశ సంస్కృతీమూలాలు, చరిత్ర మర్చిపోకూడదనే ఉద్దేశంతో ఆర్‌ఎస్‌ఎస్‌ను స్థాపించారని గుర్తుచేశారు. దేశ పరమ వైభవ స్థితి కోసం ఆర్‌ఎస్‌ఎస్ వందేళ్లుగా పని చేస్తోందన్నారు. రెండు రోజులపాటు కొనసాగనున్న ఈ శిబిరం ఆదివారం సాయంత్రం నిర్వహించే సార్వజనికోత్సవంతో పూర్తవుతుందని నిర్వాహకులు తెలిపారు. వెక్టార్ కళాశాల కరస్పాండెంట్ గజానన్, ఇందూరు విభాగ్ కార్యవాహ రాజుల్వార్ దిగంబర్ పాల్గొన్నారు.

## సమాచారం లేకుండానే రైల్వే పనులు



ఎడపల్లి(బోధన్): ముందస్తు సమాచారం లేకుండా మండల కేంద్రంలోని రైల్వే గేటు వద్ద రైల్వే శాఖ అధికారులు శనివారం ఆకస్మికంగా మరమ్మతులు చేపట్టారు. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. రైల్వే గేటు వద్ద మధ్యాహ్నం 2 గంటలకు పనులను ప్రారంభించారు. దీంతో గేటుకు ఇరువైపులా వాహనాలు నిలిచిపోయాయి. కనీస సమాచారం లేకుండా మరమ్మతులు చేపట్టడం ఏమిటని వాహనదారులు అసహనం వ్యక్తం చేశారు. ట్రాక్ మరమ్మతులు చేసినప్పటికీ బీటీ రోడ్డుకు సమాంతరంగా కంకర వేయకపోవడంతో ద్విచక్ర వాహనాల వారు జారిపడ్డారు. రెండు గంటల పాటు రహదారిపై ట్రాఫిక్ జామైంది.

## 'జితేందర్‌రెడ్డి' చిత్రం కాదు వీరుని చరిత్ర



సినిమాను వీక్షిస్తున్న ఎమ్మెల్యేలు, నాయకులు

సుభాష్‌నగర్: 'జితేందర్ రెడ్డి' సినిమా మాత్రమే కాదని, గొప్ప వీరుని చరిత్ర అని, ప్రతిఒక్కరూ చిత్రాన్ని వీక్షించాలని నిజామాబాద్ అర్బన్, ఆర్మూర్ ఎమ్మెల్యేలు ధన్‌పాల్ సూర్యనారాయణ, పైడి రాకేశ్‌రెడ్డి అన్నారు. జితేందర్‌రెడ్డి సినిమా విడుదలైన సందర్భంగా నగరంలోని ఓ థియేటర్‌లో బీజేపీ నాయకులు, జాతీయవాదులతో కలిసి వారు చిత్రాన్ని వీక్షించారు. అంతకుముందు ముదిగంటి జితేందర్ రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు మాట్లాడుతూ.. ముదిగంటి జితేందర్ రెడ్డి జాతీయవాద సిద్ధాంతం, దేశం, ధర్మం కోసం, అఖండ భారత్ లక్ష్యంగా పని చేశారని తెలిపారు. నరహంతక నక్సలైట్లకు ఎదురెల్లి ప్రాణత్యాగం చేసిన గొప్ప వీరుడని కొనియాడారు. ముదిగంటి జితేందర్‌రెడ్డి జీవిత చరిత్రను వెండి తెరపైకి తెచ్చి యువతరానికి మంచి నిర్మాణాత్మక సందేశాన్ని అందించిన చిత్ర బృందానికి వారు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేశ్ పటేల్ కులాచారి, ఏబీవీపీ, బీజేవైఎం, కార్పొరేటర్లు, వివిధ మోర్చాల ప్రతినిధులు నాగోళ్ల లక్ష్మీనారాయణ, రాజు సాగర్, రెంజర్ల నరేశ్, శశిధర్, సురేందర్‌రెడ్డి, స్వామియాదవ్, యెండల సుధాకర్, పాట్కూరి తిరుపతిరెడ్డి, సాయివర్ధన్, పిల్లి శ్రీకాంత్, జగన్‌మోహన్, మంచాల జ్ఞానేందర్ గుప్తా వివిధ క్షేత్రాల సంఘ పెద్దలు పాల్గొన్నారు.

## వివాహితపై అత్యాచారం

- అఘాయిత్యానికి పాల్పడిన ఇద్దరితోపాటు సహకరించిన మహిళపై కేసు నమోదు

నందిపేట్(ఆర్మూర్): మద్యం మత్తులో ఇద్దరు వ్యక్తులు వివాహితపై అత్యాచారానికి పాల్పడిన ఘటన నందిపేట మండలం ఉమ్మెడ గ్రామంలో చోటుచేసుకుంది. ఆలస్యంగా వెలుగు చూసిన ఈ ఘటనకు సంబంధించి గ్రామస్తులు, ఆర్మూర్ సీఐ శ్రీధర్‌రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. ఈ నెల 6వ తేదీన ఉమ్మెడకు చెందిన అరుణ్, ముత్యం అనే ఇద్దరు వ్యక్తులు బెల్టుషాపులో ఫుల్‌గా మద్యం సేవించి పక్కనే గల బుక్క భాగ్యమ్మ అనే మహిళ ఇంటికి వెళ్లారు. మాట్లాడేది ఉందని గ్రామానికి చెందిన ఓ వివాహితను అక్కడికి పిలిపించి భాగ్యమ్మ సహకారంతో సదరు మహిళపై అత్యాచారం చేశారు. అర్ధరాత్రి సమయంలో ఆ ఇంట్లో నుంచి బయటకు వచ్చిన బాధితురాలు స్పృహ తప్పి పడిపోయింది. గమనించిన గ్రామస్తులు బాధితురాలి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ఘటనాస్థలానికి చేరుకున్న బాధిత కుటుంబీకులు భాగ్యమ్మపై ఆగ్రహం వ్యక్తం చేసి చేయి చేసుకున్నట్లు తెలిసింది.

**విషయం వెలుగు చూసింది ఇలా..**

తనను మంత్రగత్తె అని ఆరోపిస్తూ దాడి చేశారని భాగ్యమ్మ మూడు రోజుల క్రితం ఆర్మూర్ ఏసీపీ వద్దకు వెళ్లి ఫిర్యాదు చేసింది. సీఐ శ్రీధర్‌రెడ్డి శుక్రవారం గ్రామానికి చేరుకొని విచారణ చేపట్టగా అసలు విషయం బయటికి వచ్చింది. భర్త చనిపోయి ఇద్దరు పిల్లలతో జీవిస్తున్న తనపై ఇద్దరు వ్యక్తులు అత్యాచారం చేశారని, భాగ్యమ్మ వారికి సహకరించిందని బాధితురాలు సీఐకి తెలిపింది. దీంతో సీఐ ఇద్దరు యువకులతోపాటు భాగ్యమ్మను విచారించగా తప్పుఒప్పుకున్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి ముగ్గురిని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

### యువకుడి అదృశ్యం



సిరికొండ: మండలంలోని రావుట్ల గ్రామానికి చెందిన బియాకర్ అరవింద్ అనే యువకుడు అదృశ్యమైనట్లు ఎస్సై ఎల్ రామ్ తెలిపారు. గ్రామానికి చెందిన బీయాకర్ రవి అనే వ్యక్తి కుమారుడు అరవింద్ ఈ నెల 6న ఇంట్లో బయటికి వెళ్లి తిరిగిరాలేదు. అతడి కోసం కుటుంబ సభ్యులు ఎంత వెతికిన ఆచూకీ లభించకపోవడంతో పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.



### క్రైం కార్నర్

### చేపల వేటకు వెళ్లి మృతి

ఖలీల్‌వాడి: నగరంలోని ఆరో పోలీస్‌స్టేషన్ పరిధిలోని శాస్త్రినగర్‌కు చెందిన సంపంగి వెంకటి(19) అనే యువకుడు చేపల వేటకు వెళ్లి నీట మునిగి మృతిచెందినట్లు ఎస్సై వెంకట్‌రావు శనివారం తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి.. స్నేహితుడితో కలిసి వెంకటి శాస్త్రినగర్‌లోని నీటి కుంటలో చేపలు పట్టేందుకు వెళ్లాడు. చీకటి పడడంతో ఇంటికి వెళ్దామని అతడి స్నేహితుడు అనగా వెంకటి అంగీకరించలేదు. దీంతో అతడి స్నేహితుడు ఇంటికి వెళ్లిపోయాడు. రాత్రి అయినా వెంకటి ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు, స్నేహితులు ఆరా తీశారు. వెంకటితోపాటు చేపల వేటకు వెళ్లిన స్నేహితుడు జరిగిన విషయాన్ని చెప్పడంతో శనివారం ఉదయం వెళ్లి నీటి కుంటలో గాలించగా వెంకటి మృతదేహం లభించింది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

**రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి..**

ఎడపల్లి (బోధన్): ఆర్టీసీ బస్సు ఢీకొన్న ఘటనలో గాయాలపాలైన వ్యక్తి చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందినట్లు ఎస్సై వంశీచందర్‌రెడ్డి తెలిపారు. ఎడపల్లికి చెందిన పల్లికొండ సాయిలు(41) తన ద్విచక్రవాహనంలో గ్రామ శివారులోని పెట్రోల్ బంక్‌లో పెట్రోల్ పోయించుకుని తిరిగి వస్తుండగా బోధన్ నుంచి నిజామాబాద్‌వైపు వస్తున్న మహారాష్ట్ర ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. గాయాలపాలైన సాయిలును చికిత్స నిమిత్తం నిజామాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

### రెండు గడ్డి వాములు దగ్ధం

రుద్రూర్: పోతంగల్ మండలం కల్లూర్ గ్రామంలో శుక్రవారం రాత్రి అగ్ని ప్రమాదం సంభవించి రెండు గడ్డి వాములు దగ్ధమయ్యాయి. గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు హర్షవర్ధన్, గంగాధర్ చదువుకుంటూనే జీవనోపాధి కోసం పాల వ్యాపారం చేసేందుకు నాలుగు గేదెలు కొనుగోలు చేశారు. గేదెలకు మేత కోసం ఉంచి గడ్డివాములు అగ్ని ప్రమాదంలో పూర్తి దగ్ధమయ్యాయి. గుర్తు తెలియని వ్యక్తులు నిప్పటించి ఉంటారని స్థానికులు అనుమానం వ్యక్తం చేశారు.

### పీహెచ్‌సీ ఆవరణలోకి కొండ చిలువ



బాల్కొండ: మండలంలోని కిసాన్‌నగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలోని శనివారం ఉదయం కొండచిలువ వచ్చింది. ఆస్పత్రి ప్రహరీ పక్కన కొండ చిలువ ఉండడాన్ని గమనించిన రోగులు, స్థానికులు భయాందోళనకు గురయ్యారు. అక్కడే ఉన్న వారు దానిని చంపేశారు. ఆస్పత్రి వెనుక భాగం పూర్తిగా పిచ్చి మొక్కలతో నిండిపోవడంతో పాములు సంచరిస్తున్నాయని స్థానికులు అంటున్నారు.

### హాసాకొత్తూర్‌లో పట్టపగలు చోరీ



కమ్మర్‌పల్లి: మండలంలోని హాసాకొత్తూర్‌లో శనివారం పట్టపగలు చోరీ జరిగింది. గ్రామానికి చెందిన నాయిని పురుషోత్తం అనే వ్యక్తి శనివారం ఉదయం 10 గంటలకు ఇంటికి తాళం వేసి తన భార్యతో కలిసి దోన్కల్ గ్రామానికి వెళ్లాడు. ఇంటి తాళాన్ని పగులగొట్టి లోనికి ప్రవేశించిన దుండగులు బీరువాలోని 10 తులాల బంగారు ఆభరణాలను ఎత్తుకెళ్లారు. మధ్యాహ్నం 12.30 గంటల సమయంలో పురుషోత్తం సోదరుడు మారుతి ఇంటికి రాగా, తలుపులు తెరిచి ఉండడాన్ని గమనించి తన అన్నయ్యకు సమాచారం అందించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

### వడ్ల లారీ బోల్తా

బాన్సువాడ రూరల్: మండలంలోని సోమేశ్వర్ గ్రామ శివారులో ప్రధాన రహదారిపై శుక్రవారం రాత్రి వడ్ల సంచులతో వెళ్తున్న లారీ ప్రమాదవశాత్తు బోల్తా పడింది. మొగులాన్‌పల్లి గ్రామం నుంచి ధాన్యం బస్తాలను దుర్కి గ్రామంలోని రైస్‌మిల్లుకు తరలిస్తుండగా మూలమలుపు వద్ద ఈ ఘటన చోటు చేసుకుంది. డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి.

## ఉమ్మడి జిల్లాలో నలుగురి ఆత్మహత్య

వేర్వేరు కారణాలతో ఉమ్మడి జిల్లాలో నలుగురు బలవన్మరణాలకు పాల్పడ్డారు.

**వెన్నునొప్పి భరించలేక..**



పల్లె నవీన్ (ఫైల్)

మోపాల్: వెన్నునొప్పి భరించలేక మండలంలోని న్యాల్‌కల్ గ్రామానికి చెందిన పల్లె నవీన్ (37) అనే వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడని ఎస్సై చుక్క యాదగిరి శనివారం తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి.. ప్రైవేట్ ఉద్యోగం చేసే నవీన్ గతేడాది నుంచి వెన్నుముక నొప్పితో బాధపడుతున్నారు. కొంతకాలం క్రితం ఆపరేషన్ చేయించుకున్నప్పటికీ నొప్పి తగ్గకపోగా, వారం రోజుల నుంచి మరింత ఎక్కువకావడంతో నవీన్ మనస్తాపానికి గురయ్యాడు. శుక్రవారం ఉదయం పొలం వద్దకు వెళ్లిన నవీన్ తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు వెతికారు. స్మార్ట్ సిటీ వెంచర్ ఎదురుగా ఉన్న ఒర్రెలో లుంగీతో చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలాన్ని పరిశీలించారు. మృతుడి భార్య పల్లె సాత్విక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై యాదగిరి తెలిపారు.

**ఆర్థిక ఇబ్బందులతో..**

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండలంలోని భూంపల్లి గ్రామానికి చెందిన మొగ్గం శ్రవణ్(24) అనే యువకుడు ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై రంజిత్ తెలిపారు. బయటికి వెళ్లివస్తానని శుక్రవారం సాయంత్రం ఇంట్లో నుంచి బయటికి వెళ్లిన శ్రవణ్ తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పలుచోట్ల వెతికారు. గ్రామశివారులోని చెట్టుకుని ఉరేసుకుని శ్రవణ్ ఆత్మహత్య చేసుకున్నాడని గ్రామస్తులు సమాచారం ఇవ్వడంతో కుటుంబసభ్యులు లబోదిబోమన్నారు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

**అప్పుల బాధ తాళలేక..**

కామారెడ్డి క్రైం: అప్పుల బాధ తాళలేక క్యాసంపల్లి శివారులో ఓ వ్యక్తి శుక్రవారం రాత్రి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాలు ఇలా ఉన్నాయి.. రామేశ్వర్‌పల్లికి చెందిన రాయలపురం నర్సాగౌడ్ (52) అనే వ్యక్తి గతంలో పలుమార్లు బతుకుదెరువు కోసం దుబాయికి వెళ్లి వచ్చాడు. అక్కడ సరైన ఉపాధి లభించకపోవడంతో అప్పులు పెరిగాయి. కొద్ది రోజులుగా క్యాసంపల్లి వద్దనున్న ఓ కల్లు దుకాణంలో పనిచేస్తున్నాడు. అప్పులు తీర్చేమార్గం లేకపోవడంతో మనస్తాపానికి గురయ్యాడు. శుక్రవారం ఉదయం ఇంటి నుంచి వెళ్లిన నర్సాగౌడ్ క్యాసంపల్లి శివారులో చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య లావణ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై రాజు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

### తల్లిదండ్రులు ఇష్టంలేని పెళ్లి చేస్తున్నారని..



చాకలి సంపత్(ఫైల్)

గాంధారి(ఎల్లారెడ్డి): తల్లిదండ్రులు తనకు ఇష్టం లేని పెళ్లి చేస్తున్నారని మండలంలోని జువ్వాడి గ్రామానికి చెందిన చాకలి సంపత్(22) బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై ఆంజనేయులు శనివారం తెలిపారు. ఇష్టంలేని పెళ్లి చేసేందుకు తల్లిదండ్రులు ప్రయత్నం చేస్తుండడంతో మనస్తాపానికి గురైన సంపత్ ఈనెల 7వ తేదీన మధ్యాహ్నం ఇంట్లో నుంచి బయటికి వెళ్లాడు. ఫోన్ స్విచ్ఛాఫ్ కావడంతోపాటు తిరిగి ఇంటికి రాకపోవడంతో తండ్రి సాయిలు పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు అదృశ్యం కేసు నమోదు చేశారు. శనివారం సాయంత్రం గ్రామ శివారులోని వ్యవసాయ బావిలో ఓ మృతదేహం ఉన్నట్లు గమనించిన స్థానికులు యువకుడి కుటుంబ సభ్యులతోపాటు గ్రామస్తులకు సమాచారం ఇవ్వగా అది సంపత్ మృతదేహమేనని నిర్ధారించారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## ఆత్మహత్య కేసులో ఏఎస్సైపై విచారణ



మృతుడి భార్య పోలీసులకు చేసిన ఫిర్యాదు

ఖలీల్‌వాడి: అప్పుల వాళ్ల వేధింపులు తాళలేక నగరానికి చెందిన సయ్యద్ హబీబ్ అజాహర్ ఈనెల 6న ఎడపల్లి మండలంలోని అశోక్‌సాగర్ చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. అర్షద్ అనే వ్యక్తి వద్ద అజాహర్ అప్పులు తీసుకున్నాడని, డబ్బుల కోసం అర్షద్‌తోపాటు ఒకటో టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఏఎస్సైగా పని చేస్తున్న అతడి మామ షకీల్ అజాహర్‌ను వేధించారని మృతుడి భార్య ఆస్మా ఆయేషా ఆరో టౌన్ పోలీస్ స్టేషన్‌లో లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసింది. షకీల్ తన భర్తను వడ్డీల కోసం స్థానిక ఒకటో టౌన్ పోలీస్ స్టేషన్‌కు పిలిపించి ప్రామిసరీ నోట్‌లు రాయించారని ఫిర్యాదులో పేర్కొన్నది. ఆరో టౌన్ పోలీసులు మాత్రం పూలాంగ్‌కు చెందిన అర్షద్ వేధింపుల కారణంగా సయ్యద్ హబీబ్ అజాహర్ ఆత్మహత్య చేసుకున్నాడని కేసు నమోదు చేశారు. ఎఫ్ఐఆర్ లో షకీల్ పేరును చేర్చకపోవడం చర్చనీయాంశమైంది. ఏఎస్సై షకీల్‌పై పోలీసులు కేసు నమోదు చేయకుండా విచారణ పేరుతో జాప్యం చేస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. సామాన్యులపై ఫిర్యాదులు రాగానే కేసులు నమోదు చేసే పోలీసులు.. ఏఎస్సై విషయంలో విచారణ పేరుతో దాటవేయడం వెనుక మతలబు ఏమిటని పలువురు పేర్కొంటున్నారు. దీనిపై ఆరో టౌన్ ఎస్సై వెంకట్రావును వివరణ కోరగా.. ఏఎస్సై షకీల్ ప్రమేయంపై విచారణ చేస్తున్నామని, మృతుడి భార్య ఫిర్యాదు చేసింది వాస్తవమేనని చెప్పారు.

## తమపై దాడి చేశారని మహిళ ఫిర్యాదు

ఖలీల్‌వాడి: తనతోపాటు తన భర్తపై ముగ్గురు దాడి చేశారని, ఆ సమయంలో బంగారు గొలుసు పోయిందని నగరంలోని ఒకటో టౌన్ పోలీస్ స్టేషన్‌లో గాయత్రి అనే మహిళ శనివారం ఫిర్యాదు చేసినట్లు ఎస్‌హెచ్‌వో రఘుపతి తెలిపారు. బాధితురాలు ఫిర్యాదులో పేర్కొన్న వివరాలు ఇలా ఉన్నాయి.. వీక్లీ మార్కెట్‌లో తన టైలర్ వర్క్‌షాపు ముందు అమృత అనే మహిళ కూరగాయలు విక్రయిస్తుండడంతో పక్కకు వెళ్లి అమ్ముకోవాలని సూచించగా, అమృతతోపాటు ఆమె అక్క వైష్ణవి, తమ్ముడు కలిసి తనపై దాడి చేశారని గాయత్రి ఫిర్యాదులో పేర్కొంది. తన భర్త రమేశ్‌పై సైతం దాడి చేసి దుకాణంలోని అద్దాలను ధ్వంసం చేశారని, తన మెడలోని బంగారు గొలుసు పోయిందని ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

### రెండు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత



రెంజల్(బోధన్): అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఎస్సై సాయన్న తెలిపారు. శుక్రవారం రాత్రి మండలంలోని కందకుర్తి శివారు నుంచి రెండు ట్రాక్టర్లలో ఇసుకను బోర్గాం గ్రామానికి తరలిస్తున్నారనే సమాచారం మేరకు సిబ్బందితో కలిసి దాడి చేశామన్నారు. బోర్గాం శివారులో పట్టుకుని స్టేషన్‌కు తరలించామని తెలిపారు. శనివారం కేసు నమోదు చేశామన్నారు.

**అటవీ భూమిని చదును చేసిన..**



సిరికొండ: రేంజ్ పరిధిలోని రావుట్ల సెక్షన్ బీట్‌లో అటవీ భూమిని చదును చేస్తున్న ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్లు డిప్యూటీ రేంజ్ అధికారి గంగారాం శనివారం తెలిపారు. రావుట్ల బీట్ పరిధిలోని కంపార్ట్‌మెంట్ నంబర్ 394లో జరుపుల మోహన్ అనే వ్యక్తి తన ట్రాక్టర్‌తో భూమిని చదును చేస్తుండగా పట్టుకున్నట్లు డీఆర్‌వో తెలిపారు. ట్రాక్టర్‌ను పోలీస్ స్టేషన్‌కు తరలించి, కేసు నమోదు చేశామన్నారు. సెక్షన్ అధికారి కృష్ణగీత్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.